క్లుప్తంగా

దీపావళితో ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు


సంజీవయ్య, రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం)/ నాయుడుపేట టౌన్: దీపావళితో ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు విరజిమ్మాలని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. వారు బుధవారం ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

గ్యాస్ సిలిండర్లకు నమోదు చేసుకోండి

గూడూరు రూరల్: ప్రభుత్వం పేదలకు దీపావళి నుంచి ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టిందని గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ ఉచిత గ్యాస్ సిలిండర్‌కు అర్హులని, సిలిండర్ కోసం బుక్ చేసుకోవాలని సూచించారు. మార్చి 31 వరకు మొదటి సిలిండర్ కోసం బుక్ చేసుకోవాలని తెలిపారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

కలువాయి: కలువాయి ఆర్యదయానంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం కలువాయికి చెందిన అధ్యాపకులు చల్లా శ్రీనివాసులురెడ్డి దుస్తులు అందజేశారు. అన్నదానం చేశారు. తన తల్లిదండ్రులు చల్లా రమణారెడ్డి, రమణమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. పార్లపల్లి దయాకర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ గంగ జలాలు

పెళ్లకూరు: రబీ సాగు చేపట్టిన రైతులకు సాగు నీటి కష్టాలు తలెత్తకుండా ప్రతి ఎకరాకూ తెలుగుగంగ జలాలు అందిస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. పునబాకలో బుధవారం 7వ బ్రాంచ్ తెలుగుగంగ కాలువ వద్ద జలహారతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని చెరువులకు గంగ నీటిని విడుదల చేస్తామన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, కృష్ణయ్య, హరినాయుడు, డీఈ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమీలారాణి, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

చిల్లకూరు: మద్యం విక్రయాల్లో అవకతవకల కు పాల్పడితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ షేక్ కరీమాబేగం హెచ్చరించారు. ఆమె బుధవారం గూడూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో గూడూరు, చిల్లకూరు మండలాల్లోని మద్యం దుకాణాల లైసెన్స్‌దారులతో సమావేశమయ్యారు.

ధరల బోర్డు తప్పనిసరి

వాకాడు: అన్ని మద్యం షాపుల వద్ద తప్పనిసరిగా ఎమ్మార్పీ ధరల బోర్డు పెట్టాలని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఆదేశించారు. ఆయన బుధవారం వాకాడు, చిట్టమూరు, కోట మండలాల్లో ఉన్న 15 మద్యం షాపుల లైసెన్స్‌దారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీకే విక్రయాలు చేపట్టాలన్నారు. ప్రతి దుకాణం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేయాలన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి వ్యక్తి(40) రైలు ఎక్కుతూ కింద పడి గాయపడ్డాడు. రైల్వేపోలీసులు 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి వద్దనున్న కొటక్ మహేంద్ర బ్యాంక్ డెబిట్ కార్డుపై తలారికుమార్ అని ఉంది. ఇతర వివరాలు దొరకలేదు. నలుపు రంగు జీన్స్ పాంట్, పసుపు రంగు టీషర్టు ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు 9573245266, 94409 04877లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

తడ: మండలంలోని కాదలూరులో బుధవారం వేలూరు శ్రీదేవి(27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పెళ్లకూరు మండలం పెన్నేపల్లికు చెందిన శ్రీదేవికి 11 ఏళ్ల క్రితం కాదలూరు కొత్త హరిజనవాడకు చెందిన సునీల్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. దంపతుల మధ్య కొంతకాలంగా గొడవ పడుతున్నారు. మంగళవారం రాత్రి కూడా ఘర్షణ పడ్డారు. బుధవారం తెల్లవారుజామున శ్రీదేవి మృతిచెంది ఉంది. తమ కుమార్తెది ఆత్మహత్య కాదని, హత్య అని మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకుంటాం

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలంలో ఇటీవల తొలగించిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను కోర్టు ఉత్తర్వుల ప్రకారం తిరిగి విధుల్లోకి తీసుకుంటామని ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు. టీడీపీ నేతల ఒత్తిడి మేరకు అధికారులు ఆలేటిపాడు, యాకసిరి, మల్లాం, ఆరూరు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. వారిని విధుల్లోకి తీసుకోకపోవడంతో బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ ఏపీవో ప్రస్తుతం సెలవులో ఉన్నారని, ఆయన వచ్చిన వెంటనే విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాయితీల పేరుతో బురిడీ

చిన్నాపెద్దా తేడా లేకుండా ఆనందంగా జరుపుకునే పండుగ దీపావళి. ప్రతి ఒక్కరూ టపాసులు కాల్చుకుంటూ ఆనందంగా గడుపుతారు. దీన్ని ఆసరాగా తీసుకున్న విక్రయదారులు ప్రజల నుంచి రాయితీల పేరుతో బురిడీ కొట్టిస్తున్నారు. ప్యాకెట్లపై ఎక్కువ ధరలు ముద్రించి తక్కువకు ఇస్తున్నట్టు నమ్మిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- బాణసంచా విక్రయదారుల మాయాజాలం
- ప్యాకెట్‌పై ఎక్కువ ధర ముద్రణ
- తక్కువకు ఇస్తున్నట్లు నమ్మిస్తున్న వైనం
- గూడూరు నియోజకవర్గంలో 44 లైసెన్సు దుకాణాలు


గూడూరు బైపాస్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా దుకాణాలు

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలో 44 లైసెన్స్ కలిగిన దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా ఒక్క దీపావళి రోజే సుమారు రూ.1.50 కోట్ల వ్యాపారం జరుగుతుంది. కొత్తగా వ్యాపారంలోకి వచ్చిన వారు ప్రజలను ఆకట్టుకునేందుకు రాయితీలను ప్రకటిస్తున్నారు. ముఖ్యంగా 10 నుంచి 25 శాతం వరకు రాయితీ ఇస్తున్నామని చెబుతున్నారు. ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. బాణసంచా ప్యాకెట్లపై అధిక ధరలు ముద్రిస్తున్నారు. వాటిపై రాయితీ ఇస్తున్నట్టు నమ్మించి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. బాణసంచాలో మేటి శివకాశి నుంచి సాండర్డ్ కంపెనీకి చెందిన బాణసంచాను కొద్దిగా మాత్రమే తెప్పిస్తున్నారు. వాటిని ముందు పెట్టుకుని నెల్లూరు, చిలకలూరిపేట, విజయవాడ, ఒంగోలు, చెన్నై ప్రాంతాల్లో దొరికే లోకల్ మేడ్ బాణసంచాను ఎక్కువగా విక్రయిస్తున్నారు.

తాత్కాలిక దుకాణాల ఏర్పాటులో తమ్ముళ్ల మతలబు

గూడూరు పట్టణానికి దూరంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో తాత్కాలిక దుకాణాల ఏర్పాటులో తమ్ముళ్లు తమ మార్కు రాజకీయం చేస్తున్నారు. దుకాణం ఏర్పాటుకు అనుమతి పొందిన వ్యాపారులకు ప్రజాప్రతినిధితో ఫోన్ చేయించి తమ వారితో తాత్కాలిక షెడ్లు ఏర్పాటుచేయించాలని ఆదేశం ఇప్పిస్తున్నారు. తద్వారా వచ్చిన ఆదాయంలో వాటా ఇవ్వాల్సి వస్తుండడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇలా అయితే తమకు మిగిలేది ఏమిటని వాపోతున్నారు.

అనుమతులు తప్పనిసరి



గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. తాత్కాలిక దుకాణాల లైసెన్సుతో పాటు బాణసంచా తయారీ కేంద్రాల వారు పర్మినెంట్ లైసెన్సు దగ్గర ఉంచుకోవాలి.

–రమణకుమార్, డీఎస్పీ, గూడూరు

ఉపాధి హామీ ఏపీవోపై ఫిర్యాదు


ఏపీవో పూర్ణిమపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న కూలీలు

కోట: ఉపాధి హామీ పథకం ఏపీవో పూర్ణిమ టీడీపీ నేతలతో కుమ్మక్కై తమకు పనులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కొత్తపట్నం పంచాయతీకి చెందిన ఉపాధి కూలీలు ఆరోపించారు. వారు బుధవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఆమె అధికార టీడీపీకి చెందిన ఒక వర్గం వారికి మాత్రమే లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. కోర్టు ఆదేశాలతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తిరిగి నియమించారని, అతనిపై కక్షతో కూలీలకు పనులు చూపకుండా వేధిస్తున్నారని వాపోయారు. వారం రోజులు కష్టపడినా తమ పేర్లు మస్టర్ల నుంచి తొలగించారని తెలిపారు. కొత్తపట్నం పంచాయతీలో రైతులకు సౌకర్యాంగా ఉన్న సొన కాలువ పనులు చేస్తుండగా, వెంటనే ఆపాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఆమెను విధుల నుంచి తొలగించాలని కోరారు. అనంతరం కొత్తపట్నం సర్పంచ్ తిరుపాలయ్య, ఉపసర్పంచ్ ప్రసాద్‌గౌడ్‌తో కలిసి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

మాజీ జెడ్పీటీసీపై అక్రమ కేసు

కోట : ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడుతున్న ఏపీవో పూర్ణిమను తొలగించాలని కొత్తపట్నం కూలీలు ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. వారికి మద్దతుగా వచ్చిన మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్‌పై పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ నాయకులు ఏపీవో పూర్ణిమపై ఒత్తిడి తీసుకువచ్చి మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్ గౌడ్‌పై ఫిర్యాదు చేయించినట్టు సమాచారం. ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

విద్యా రంగంలోని సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

గూడూరు రూరల్: విద్యా రంగంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం విద్యార్థులతో కలిసి గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తయినా నేటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. తల్లికి వందనం దూరం చేశారని విమర్శించారు. రాష్ట్రంలోని విద్యార్థులకు రూ.3,480 కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని, మెస్ చార్జీలు రూ.3 వేలు పెంచి ఇవ్వాలన్నారు. 77 జీవోను రద్దు చేసి ఎంబీఏ, ఎంసీఏ, పీజీ విద్యార్థులకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి, నాయకులు శ్రీనివాసులు, మహేష్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

కోట: పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ జయజయరావు తెలిపారు. కోటలోని శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని సామాజిక ప్రగతి సాధించాలన్నారు. ఎంపీడీవో వేణు మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పూలతోట ఎస్టీ కాలనీలో సివిల్ రైట్స్ డే

దొరవారిసత్రం: మండలంలోని పూలతోట ఎస్టీ కాలనీలో బుధవారం రెవెన్యూ అధికారులు సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు హక్కులు, విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని సంగనపల్లి గిరిజ కాలనీలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు


మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి

నాయుడుపేట టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం పులివెందులలో నాయుడుపేటకు చెందిన వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకుల ఆధ్వర్యంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, ప్రజల సమస్యలపై పోరాటాలు చేయాలని జగన్ మోహన్‌రెడ్డి సూచించినట్టు తెలిపారు.

బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు

ఓజిలి: మండలంలోని కొత్తచెరువులో బుధవారం బైక్ బోల్తా పడి ఇద్దరు గాయపడ్డారు. కొత్తచెరువు ఎస్సీ, ఎస్టీ కాలనీలో కొద్ది రోజుల నుంచి మూడు మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఎస్టీ కాలనీకి చెందిన సురేష్, శ్రీనివాసులు పూటుగా మద్యం సేవించి బైక్‌పై మేల్చూరుకు బయలుదేరారు. కొంతదూరం వెళ్లాక బైక్ బోల్తాకొట్టింది. గాయపడిన ఇద్దరిని స్థానికులు వెంకటగిరి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి వైద్యులు తిరుపతి రుయాకు పంపించారు. గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టు షాపు విషయాన్ని నాయుడుపేట ఎక్సైజ్ సీఐ అరుణకుమారి దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రక్త దానం ప్రాణ దానంతో సమానం


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎస్పీ రమణకుమార్, సీఐలు

గూడూరు రూరల్: రక్త దానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని గూడూరు డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో రక్త దానం శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చన్నారు. తద్వారా కొత్త రక్తం ఉత్పత్తి అయి వ్యాధులు దూరం అవుతారన్నారు. అనంతరం రక్త దానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గూడూరు పట్టణ, రూరల్ సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు. కళాశాల ఏవో రామయ్య పాల్గొన్నారు.

కండలేరు 2బి కెనాల్ ద్వారా నీటి విడుదల


సత్యసాయి గంగ కాలువ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయం నుంచి బుధవారం సైదాపురం, గూడూరు మండలాల రైతులకు 50 క్యూసెక్కుల నీటిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విడుదల చేశారు. అంతకుముందు చెర్లోపల్లి వద్ద ఉన్న సత్యసాయి బి.కెనాల్ వద్ద గంగమ్మకు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం కండలేరు జలాశయంలో 55 నుంచి 58 టీఎంసీల నీరు నిల్వ చేస్తామన్నారు. మొదటగా 50 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని, గురువారం నుంచి అధికంగా విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగుగంగ డివిజన్ 1 ఈఈ సత్యప్రసాద్, దందోలు వెంకటేశ్వరరెడ్డి, వెంకటరమణారెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 43.867టీ ఎంసీల నీరు

కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 43.867 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10.150 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1360, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

వెంకటగిరి రూరల్: ఎరువుల దుకాణాల డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఏడీఏ నాగార్జునసాగర్ ఆదేశించారు. ఆయన బుధవారం వెంకటగిరిలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆర్ఎన్ఆర్ 15048, 2345 ఈహెచ్ఎస్, కేఎన్ఎం 1638, 442 వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. అధిక ధరలకు విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో సుజాత పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.2.36 లక్షలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.2,36,745 ఆదాయం వచ్చినట్లు గూడూరు డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఈవో రవికృష్ణ తెలిపారు. ఆలయంలో బుధవారం హుండీలోని కానుకలతో పాటు 8 ఏళ్లుగా భక్తులు సమర్పించిన బంగారు, వెండి వస్తువులను లెక్కించామన్నారు. బంగారం 35 గ్రాములు, వెండి 350 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోట గ్రూప్ దేవాలయాల ఈవో శశాంక్, పోలేరమ్మ ఆలయ పెదకాపు ఆరవభూమి శ్రీనివాసులురెడ్డి, ఆకుల కుబేరు మణి, కరింబాయి, హరిబాబు, అర్చకులు రాయపూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో పంచారామాలకు ప్రత్యేక బస్సు

రాపూరు: కార్తీక మాసంలో రాపూరు ఆర్టీసీ డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. రాపూరు ఆర్టీసీ డిపో నుంచి 17వ తేదీ రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరి అమరావతిలోని అమరారామం, భీమేశ్వరంలోని సోమేశ్వర ఆలయం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షారామంలోని భీమేశ్వరాలయం, సామర్లకోటలోని కొమారాలయం చేరుకుంటుందని తెలిపారు. భక్తులు అక్కడి స్వామి వార్లను దర్శించుకున్న తర్వాత మంగళవారం రాపూరుకు చేరుకుంటుందన్నారు. టికెట్టు ధర రూ.2,900 చెల్లించి సీటు రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 6303036216, 7205593111, 7382886451లో సంప్రదించాలని సూచించారు.

నారుమడి యాజమాన్యంపై రైతులకు అవగాహన

పెళ్లకూరు: నారుమడుల యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ అధికారి ప్రవీణ తెలపిఆరు. మండలంలోని కలవకూరు, అనకవోలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎకరా పొలానికి 5 సెంట్లు నారుమడి సిద్ధం చేసుకుని 2 కేజీల నత్రజని, కేజీ భాస్వరం, కేజీ పొటాష్ దుక్కిలో వేసుకోవాలన్నారు. నారు తీయడానికి వారానికి ముందు ఒక సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బొఫ్యూరాన్ గుళికలు వేయాలని సూచించారు. జింక్ లోపాన్ని నివారించడానికి లీటరు నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: మండలంలోని సింగనాలత్తూరు, కట్టువాపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ అనిత, ఏవో జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటను ఉల్లికోటి, తెల్లతెగుళ్లు ఆశించాయని తెలిపారు. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డ్రోన్ సాయంతో వరిలో కలుపు మందు పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు.


వాకాడులో..

వాకాడు: మండలంలోని మొనపాళెంలో బుధవా రం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు సిద్ధం చేసుకున్న నారుమడి, కలుపు నివారణ, ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాశాఖ అధికారిణి దీప అవగాహన కల్పించారు. ఉపసర్పంచి వెంకటరత్నం, సిబ్బంది లక్ష్మయ్య పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి: రైతులు నమ్మ సాగులో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని నిమ్మ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త వై.శ్యామ్‌సుందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారిణి విజయభారతి తెలిపారు. మండలంలోని వెంబులూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చీనీ, నిమ్మ శాస్త్రవేత్త బి.ప్రతాప్, ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌రెడ్డి, పశువైద్యాధికారి ఎంవీ స్వామి, జిల్లా వనరుల శాఖ అధికారి శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్ సేవలు చిరస్మరణీయం


వెంకటగిరి ఫారెస్ట్ రేంజర్‌ను సన్మానిస్తున్న అటవీశాఖ అధికారులు తదితరులు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి ఫారెస్ట్ రేంజర్‌గా రాజేంద్ర ప్రసాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని తిరుపతి డీఎఫ్‌వో వివేక్ తెలిపారు. రేంజర్ రాజేంద్ర ప్రసాద్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వెంకటగిరిలోని అటవీశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి రేంజ్‌లో అటవీ పరిరక్షణ, స్మగ్లింగ్ నిర్మూలనకు రాజేంద్రప్రసాద్ ఎనలేని సేవలు అందించారని తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిత్తూరు డీఎఫ్‌వో జ్ఞాన ప్రకాష్, సబ్ డీఎఫ్‌వో నాగభూషణం, శామ్యూల్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

దక్కిలి: మండలంలోని చాకలపల్లి దళితవాడలో ఉపాధి నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన లింగసముద్రంలో ఉపాధి కింద సాగు చేసిన నిమ్మ తోటలను పరిశీలించారు.